# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక






సంపుటి : 01 | సంచిక : 102 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 11 మార్చి 2026 | పేజీలు : 4







# మత్తు రహిత సమాజమే లక్ష్యం

## ఈగల్ ఫోర్స్ ఎస్పీ సీతారాం



**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణను మత్తు పదార్థాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రతి పౌరుడి లక్ష్యం కావాలని ఈగల్ ఫోర్స్ ఎస్పీ (నార్కోటిక్) సీతారాం పిలుపునిచ్చారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ కు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ గంజాయి, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల్లో ప్రేమానురాగాలు ఉండేవని, ఇప్పుడు ఒంటరితనం వల్ల యువత మత్తుకు బానిసల వుతున్నారు. ఇది వారి బంగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తుందన్నారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ పండరి చేతన్ నితిన్, సీఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్సై భరత్, రితీష్, మున్సిపల్ చైర్పర్సన్ బాలమణి, వైస్ చైర్మన్ పర్వతాలు, మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# 'అర్థోపెడిక్'లో మెరుగైన వైద్య సేవలు

**జనగామ, మన చౌరాస్తా :** హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రిలో అర్థోపెడిక్ సమస్యలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన జనగామలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో పెద్దలు, వృద్ధులే కాకుండా యువకులు, పిల్లలు కూడా ఎముకలు, కీళ్లు అరిగిపోయి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అయితే ఈ సమస్యలను అత్యాధునిక పరికరాలతో తమ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. జనగామలోని ఎస్‌ఎస్‌కే ఆస్పత్రిలో ప్రతి రెండో, నాలుగో మంగళవారం నెలలో రెండు సార్లు ఇక్కడ ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్థోపెడిక్ సమస్యలు ఉన్న బాధితులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# అలరించిన సంగీత విభావరి

## – జనగామలో 'శ్రీ శారదా స్వరలహరి' స్థాపన

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ కవులు, కళాకారులకు పెట్టింది పేరు. అలాంటి పేరున్న ఈ ప్రాంతంలో సంగీత ప్రియుల కోసం 'శ్రీ శారదా స్వరలహరి' పేరుతో ఓ కొత్త వేదిక ఆవిర్భవించింది. పట్టణంలోని గౌతమి మోడల్ స్కూల్ ఆవరణలో ఈ సంస్థ ఆవిర్భావోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఆవిర్భావ సభకు సంస్థ కన్వీనర్ ఎస్.విష్ణుచరణ్ నేతృత్వం వహించగా ప్రముఖ కవి, రచయిత చింతపట్ల సుదర్శన్ ముఖ్య అతిథిగా.. నెల్లుట్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు నెట్లట్ల రవీందర్ రావు విష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చింతపట్ల సుదర్శన్ మాట్లాడుతూ పాట పుట్టుక, దాని ప్రయాణం.. పాట చేసే మేలును సంగీత ప్రియులకు క్లుప్తంగా వివరించారు. యువ, ఔత్సాహిక గాయకులను ప్రోత్సహించడం, శిక్షణ ఇవ్వడంతో పాటు రిటైర్ అయి శేష జీవితం గడిపే సంగీత ప్రియులను ఒక్క తాటిపైకి తెచ్చి ప్రస్తుత ఒత్తిడి జీవితం నుంచి విముక్తి కల్పించడమే లక్ష్యంగా ఈ 'శ్రీ శారదా స్వరలహరి' ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గాయకులు ఎస్బీఐ మేనేజర్ దుర్గాప్రసాద్, మాతో సురేందర్ రెడ్డి, డి.అరవింద్రాచారి, ఎస్.వి.ఎస్ గిరి, పి.అనిల్ బాబు, కొండ శ్రీనివాస్, శ్రీశైలం, రాజ్కుమార్, ఎం.ఎస్ రెడ్డి, భగవాన్ రెడ్డి, రమేశ్‌తో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా కార్యక్రమానికి ముందు గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే జనగామ సోషల్ వెల్ఫేర్ ఆర్ట్ టీచర్ వేణుమాధవ్ 'వేణు' గానం, నెల్లుట్లకు చెందిన ఎబొనైజర్, కెజియా ఆలపించిన మృదంగ గానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





# ఇంటర్ పరీక్షలను పరిశీలించిన కలెక్టర్

**జనగామ, మన చౌరాస్తా :** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణను మంగళవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా పరిశీలిం చారు. ధర్మ కంచలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్రంలో హాజరైన విద్యార్థుల సంఖ్య, గైర్హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు పూర్త య్యే వరకు సిబ్బంది అప్రమత్తం గా ఉండాలని, ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా సజావుగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు, మెడికల్ సౌకర్యాలు అందుబాటులో ఉండాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించరాద ని స్పష్టం చేశారు.

# డ్రగ్స్ నివారణ అందరి బాధ్యత

## డీసీపీ రాజమహేంద్ర నాయక్

స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా : డ్రగ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వెస్ట్ జోన్ డీసీపీ రాజమ హేంద్ర నాయక్ అన్నారు. మంగళవారం స్టేషన్ ఘన్‌పూర్ పట్టణంలో ఏర్పా టు చేసిన ప్రజా పాలన ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లా డుతూ ఈ ప్రాంతాన్ని డ్రగ్ ఫ్రీ ప్రాంతంగా మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారు చెడు మార్గంలోకి వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్య క్రమంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్, కమిష్ నర్ రాధాకృష్ణ, ఎఫ్ఆర్ఓ చంద్రకాంత్ రెడ్డి, ఫైర్ ఆఫీ సర్ దేవేందర్, సీడీపీవో స్వరూప, తహసీల్దార్ వెంకటే శ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





# క్రీడలతో ఒత్తిడి దూరం

**మెదక్ ఎస్పీ శ్రీనివాస రావు**



మెదక్, మన చౌరాస్తా : శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమని, క్రీడల ద్వారా విధుల్లో ఎదురయ్యే ఒత్తిడి దూరమవుతుందని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు అన్నారు.మెదక్ జిల్లా పోలీసు కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం పోలీసు వార్షిక క్రీడోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు జెండా ఆవిష్కరించి ప్రారంభించారు.క్రీడోత్సవాల ప్రారంభానికి ముందు నిర్వహించిన పరేడ్‌ను ఎస్పీ పరిశీలించి పోలీసు సిబ్బంది నుంచి వందనం స్వీకరించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు మాట్లాడుతూ.. ప్రజల భద్రత కోసం పోలీసు సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తూ అనేక సవాళ్లను ఎదుర్కొంటారని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం ఎంతో అవసరమన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించి విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయని పేర్కొన్నారు. క్రీడా పోటీలు సిబ్బందిలో ఐక్యత, జట్టు భావన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విధుల్లో ఎంత నిబద్ధతతో పని చేస్తారో, అదే ఉత్సాహంతో క్రీడల్లో కూడా పాల్గొని ప్రతిభ కనబరచాలని సూచించారు.ఇటువంటి క్రీడా కార్యక్రమాలు పోలీసు సిబ్బంది ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ముఖ్యమని పేర్కొన్నారు. ఈ క్రీడోత్సవాల్లో క్రికెట్,వాలీబాల్, కబడ్డీ,బ్యాడ్మింటన్, పరుగుపందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్ వంటి పలు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన పోలీసు అధికారులకు, సిబ్బందికి ముగింపు కార్యక్రమంలో బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ పోటీలలో జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్ర బోస్, సీఐలు మహేష్, రేణుక రెడ్డి, కృష్ణమూర్తి,జాన్ రెడ్డి, వెంకట రాజా గౌడ్, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** రఘునాథపల్లి మండల రైతుల సంక్షేమం కోసం నర్మెట మండలం బొమ్మకూరు రిజర్వాయర్ నుండి మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీశ్ చందర్ రెడ్డి నీటిని విడుదల చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు వారు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. పలు వాగుల ద్వారా మండలంలోని చెరువులను నింపేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వరి పంటలు ఎండిపోకుండా ఉండేందుకు కడియం శ్రీహరి కృషిస్తునట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోళ్ల రవి, బోనాసి క్రాంతి కుమార్, నామాల బుచ్చయ్య, గాదె మహేందర్ రెడ్డి పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మినిట్ టు మినిట్ కార్యక్రమం

# సిద్ధం చేయాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్, మన చౌరాస్తా :** ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మార్చి 12న నిర్వహించనున్న మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల శిక్షణా తరగతులకు సంబంధించి మినిట్ టు మినిట్ కార్యక్రమాన్ని సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం హైదరాబాద్ నుండి సీఎస్ రామకృష్ణారావు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశంలో ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి కలెక్టర్ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు, అలాగే మార్చి 12న జరిగే శిక్షణా కార్యక్రమం నిర్వహణపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడానికి,అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడానికి స్థానిక ప్రజాప్రతినిధులకు సమగ్ర అవగాహన అవసరమని తెలిపారు. అందుకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమానికి విభాగాల వారీగా మినిట్ టు మినిట్ ప్రోగ్రాం రూపొందించాలని సూచించారు.అనంతరం జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్ష నిర్వహించారు. 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రతిరోజూ సమీక్షిస్తూ మున్సిపల్ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారుల నుంచి రోజువారీ నివేదికలు అందించాలని ఆదేశించారు.ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, గ్రామాలు మరియు పట్టణాల్లో శుభ్రత, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్,డిపిఓ యాదయ్య,జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# భూహక్కుల కోసం రీసర్వే పక్కాగా..

**మెదక్ అదనపు కలెక్టర్ నగేష్**



**మెదక్, మన చౌరాస్తా:** పక్కగా భూ హక్కుల కోసం రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ వివరించారు. మంగళవారం రామాయంపేట మండలంలోని అక్కన్నపేట గ్రామంలో నిర్వహించిన భూభారతి రీ సర్వే అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. 100 సంవత్సరాల పూర్వం నిజాం ప్రభుత్వం 35 నుంచి 40 సంవత్సరాల మధ్య కష్టపడి పనిచేసి భూమి నక్షను రూపొందించడం జరిగిందన్నారు. అప్పటి నుంచి కొన్ని గ్రామాల్లో భూనక్షల్లో సమస్యల తలెత్తయన్నారు. వాటిని పరిశీలించి పరిష్కరించేందుకే భూ రీ సర్వే కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసి ప్రతి భూ కమతానికి ఆన్లైన్ డిజిటలైజేషన్లో పొంద పరుస్తామన్నారు. ఏలాంటి భూ వివాదాలు లేకుండా చేసి,భూమికి భూధార్ ను అందించడం జరుగుతుందన్నారు. భూమి ప్రతి రైతుకు ఒక సెంటిమెంట్ అని ,భూమికోసం రైతులు పరితపిస్తూఉంటారన్నారు. భూ సమస్యలు లేకుండా చేయడమే దీని ఉద్దేశం అన్నారు.జిల్లాలో 24 గ్రామాల్లో భూ రిసర్వే ను శాస్త్రీయంగా నిర్వహించి రైతుల భూ హక్కులను పరిరక్షిస్థామన్నారు. భూ రిసర్వే అనంతరం విదేశాల్లో ఉన్న వాళ్ళు సైతం పక్కగా వారి భూమిని పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డిఓ రమాదేవి,ఎ .డి ల్యాండ్ సర్వే కిషన్, డి.పి ఆర్ ఓ రామచంద్ర రాజు,తహసిల్దార్ రజనీ,ఎంపీడీవో గ్రామ సర్పంచ్ యాదగిరి, ఉప సర్పంచ్ ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**